క్లుప్తంగా

విద్యార్థులకు డ్రెస్సుల పంపిణీ



వైట్ డ్రెస్‌లతో విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మౌనిక ఆనంద్ వైట్ డ్రెస్, షూ, బెల్టు అందజేశారు. సుధీర్ కుమార్ గౌడ్ డైరీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాంబాబు, ఉపాధ్యాయులు మల్లయ్య, శంకర్‌రావు, యోగీశ్వరు, నర్సింలు, కొండల్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



క్యానులో నీరు నింపుతున్న వెంకట్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గోమారం ఉన్నత పాఠశాలలో తన తల్లిదండ్రులు నర్సింహారెడ్డి ఈశ్వరమ్మల జ్ఞాపకార్థం రూ.75 వేల వ్యయం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ని శుక్రవారం నవేరా ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్, హైకోర్టు న్యాయవాది దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే.. నవేరా ట్రస్ట్ ద్వారా గోమారం, బిజ్లిపూర్, గుమ్మడిదల పాఠశాలల్లో చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు, గోమారం పాఠశాలకు వివిధ అవసరాల నిమిత్తం 10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, హెచ్‌ఎం విజయలక్ష్మీ, ఎస్‌ఎస్‌ఏ హెచరీ చైర్మన్ చైతన్య, పీడీ కిషోర్, నాయకులు నర్సింహారెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పేద కుటుంబానికి చెందిన పోచమ్మ కూతురు పెళ్లికి డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మాజీ ఉప సర్పంచ్ అశోక్ గౌడ్ కలిసి వంట సామగ్రి, పుస్తె మెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భారత్ గౌడ్, శేఖర్, చంద్రశేఖర్, విష్ణు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ యూనిఫాం అందజేత

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన ఖోఖో క్రీడాకారులకు స్పోర్ట్స్ యూనిఫాంను వాకింగ్ టీం సభ్యులు అందచేశారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులందరికి బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకింగ్ టీం సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

17న మహాసభను జయప్రదం చేయండి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): జోగిపేటలో ఈనెల 17న జరిగే గ్రామ పంచాయతీ యూనియన్ మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, దశరథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలోని పంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సభలో తీర్మానాలు చేస్తామని వెల్లడించారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని నల్తూర్‌లో జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను హెటిరో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ రవి బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. హెటిరో పరిశ్రమ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఆర్వో ప్లాంట్ అందించిందన్నారు. ఈ మేరకు పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందిస్తూ గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం స్థానికులు పరిశ్రమ ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు : కేసు నమోదు

సంగారెడ్డి క్రైమ్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జెండా రోజున మాంసం విక్రయిస్తున్న దుకాణదారులను శుక్రవారం పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని గంజి మైదానంలో స్వాతంత్ర దినోత్సవం రోజు కొంతమంది చేపలు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకొని దాడులు చేసినట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.



సేవలకు పురస్కారం

మెదక్ పట్టణంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన 131 మంది అధికారులు, సిబ్బందికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

అవార్డు అందుకున్న వారు ఎడమ నుంచి వరుసగా..

అదనపు ఎస్పీ మహేందర్, డీఈఓ రాధాకిషన్, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి విజయలక్ష్మి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరాం, డీపీఆర్‌ఓ రామచంద్రరాజు, అదనపు డీఆర్డీఓ రంగాచార్యులు, కలెక్టరేట్ ఏఓ యూనుస్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్‌రెడ్డి, ఈడీఎం సందీప్, ఎంసీహెచ్ వైద్యులు శివదయాల్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, అల్లాదుర్గ సీఐ రేణుక, పారిశుద్ధ్య కార్మికులు ఇర్ఫాన్, సుశీల, నర్సింలు, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, టేక్మాల్ తహసీల్దార్ తులసీరాం, మెదక్ లైబ్రేరియన్ నరేందర్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్, సూపరింటెండెంట్ సునీతాదేవి, సివిల్ సర్జన్ వంశీకృష్ణ, నర్సాపూర్, మైనార్టీ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సురేఖ, డీఎల్‌పీఆర్‌ఓ అటెండర్ ప్రసాద్, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి. – మెదక్ కలెక్టరేట్:

జెండాకు వందనం

ఘనంగా 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

- వాడవాడల మువ్వన్నెల రెపరెపలు
- ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాలో మువ్వన్నెల జెండా వాడవాడల రెపరెపలాడింది. 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాలు, వివిధ పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అధికారులు, ఉపాధ్యాయులు మూడు రంగుల జెండాను ఎగురవేసి జెండా వందనం నిర్వహించారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం జాతీయ జెండాలతో విద్యార్థులు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.



తూప్రాన్ ఆర్డీఓ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి



వట్‌పల్లి: భరతమాత, తెలంగాణ తల్లి, సమరయోధుల వేషధారణలో చిన్నారులు



జెండాకు వందనం చేస్తున్న నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి, తదితరులు



మెదక్ బీఆర్‌ఎస్ కార్యాలయం ఆవరణలో జెండావిష్కరణ చేస్తున్న పద్మారెడ్డి



మెదక్ మున్సిపల్ కార్యాలయంలో జెండావిష్కరణ చేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్



నర్సాపూర్‌లో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



రాయికోడ్: వేడుకల్లో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు



రామచంద్రాపురంలోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నారాయణఖేడ్ జెండా ఎగురవేస్తున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

లక్ష్మారెడ్డి ఆశయాలు కొనసాగిస్తా

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ, తన భర్త దివంగత లక్ష్మారెడ్డి ఆశయాలు కొనసాగిస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. లక్ష్మారెడ్డి 26వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం లక్ష్మారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు శక్తి ఉన్నంత వరకు లక్ష్మారెడ్డి ఆశయాలు, సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని, మండల స్థాయిలో పదవ తరగతిలో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో ఉన్న విద్యార్థులను ఎంపిక చేసిన నగదు బహుమతి, మెడల్ అందజేస్తున్నామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో సునీతారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, చంద్రాగౌడ్, శేఖర్ మన్సూర్, సత్యంగౌడ్, అశోక్‌గౌడ్, నయీం, బాల్‌రెడ్డి, ప్రసాద్, వెంకట్‌రెడ్డి, నర్సింగ్‌రావు, షేక్‌హుస్సేన్, వెంకటేష్‌గౌడ్, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా 216 మంది రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెడల్, ప్రశంసాపత్రాలు ఎమ్మెల్యే సునీతారెడ్డి అందచేశారు.



నర్సాపూర్‌లో లక్ష్మారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీత

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలో లక్ష్మారెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, నాయకులు యాదగౌడ్, మహేందర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, బాబురావు, లక్ష్మీనర్సయ్య, కొండల్, నర్సయ్య ఉన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ డబుల్ బెడ్రూం కాలనీలోని ఓ ఇంటిలో శుక్రవారం బ్రహ్మ కమలం వికసించింది. కాలనీలోని మాచునూర్ మారుతి దంపతులు తమ ఇంట్లో బ్రహ్మ కమలం మొక్కను పెంచుతున్నారు. అయితే శ్రావణమాసంలో వికసించడంతో కాలనీ వాసులు పుష్పాన్ని తిలకించడంతోపాటు పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని రాంమోహల్లాలోని ఓ ఇంటిలో కూడా బ్రహ్మ కమలం పుష్పం వికసించింది.



బ్రహ్మ కమలం

యూరియా కోసం రైతుల పాట్లు

నర్సాపూర్: యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. శుక్రవారం పట్టణంలోని మన గ్రోమోర్ వద్ద యూరియా ఉందని తెలియడంతో పలు గ్రామాలకు చెందిన రైతులు అక్కడికి పరుగులు తీశారు. టోకెన్‌లు రాయించుకొని యూరియా తీసుకున్నారు. పట్టణంలోని చౌరస్తా సమీపంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో యూరియా ఉండగా.. అడుగుమందు, గుళికలు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తానని దుకాణం యజమాని లింకు పెడుతున్నాడని పలువురు రైతులు ఆరోపించారు. యూరియాకు ఇతర మందులతో లింకు పెట్టడం పట్ల రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు తగిన చర్యలు తీసుకుని లింకు లేకుండా యూరియా అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కాగా, తాము గతంలో ఇతర దుకాణాలలో అడుగు మందు కొనుగోలు చేశామని, గుళికలు లేదా అడుగు మందు కొంటేనే యూరియా బస్తాలు ఇస్తానని కపిల్ ఫర్టిలైజర్ దుకాణం యజమాని అంటున్నాడని ఓ రైతు వాపోయాడు. యూరియా కోసం నాలుగు రోజులుగా నర్సాపూర్ వచ్చి పోతున్నామని చెప్పాడు.



మన గ్రోమోర్ కేంద్రం వద్ద టోకెన్ రాయించుకుంటున్న రైతులు

యూరియా కోసం బారులు

చిన్నశంకరంపేట(మెదక్): మడూర్ సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. యూరియా వచ్చిందని తెలియడంతో ఒక్కసారిగా రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పీఏసీఎస్ సిబ్బంది ముందుగా టోకెన్ ఇచ్చారు. అనంతరం ఒక్క రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియాను అందించారు.

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

కాంగ్రెస్ నేత రాజిరెడ్డి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న రాజిరెడ్డి, నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి చండీ– అనంతరం చౌరస్తా వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను గోమారం వద్ద పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి వాహనదారులు, ప్రజల ఇబ్బందులు తొలగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. గోమారం వద్ద బీసీ కాలనీ నుంచి ఉన్నతి గ్లోబల్ పాఠశాల వరకు రోడ్డు విస్తరణ పెంచి మధ్యలో డివైడర్ నిర్మాణానికి కావాల్సిన అదనపు నిధుల కోసం ప్రతిప్రాదనలు ఇవ్వాలని ఆర్ అండ్‌బీ డీఈకి సూచించారు. సీఎంతో మాట్లాడి అదనపు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నవీన్‌గుప్తా, నర్సింహారెడ్డి, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- తహసీల్దార్ మల్లయ్య
- బట్టికుంట పరిశీలన

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలో గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో రహదారిపై నీరు నిలుస్తుంది. బట్టికుంట నుంచి పటేల్ చెరువుకు పోయే కాలువ పూడికతో నిండిపోవడంతో అల్లాదుర్గంకు వెళ్లే రహదారిపై మోకాల్లోతు నీరు ప్రవహిస్తుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిని తహసీల్దార్ మల్లయ్య, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఇరిగేషన్ ఏఈ వైష్ణవి పరిశీలించారు. చెరువు అలుగును పరిశీలించి కాలువలో పూడిక ఉండటంతో చెరువులోకి పోయే నీరు వృథాగా పోతుందని స్థానికులు అధికారులతో తెలిపారు. రోడ్డుపై నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఇరిగేషన్ ఏఈని ఆదేశించారు. రోడ్డుపై నీటి ఫ్లో అధికంగా ఉండడంతో వాహనాలు నడిపేవారు జాగ్రత్తగా వెళ్లాలన్నారు. నీటి ప్రవాహం వద్ద ప్రమాదాలు జరగకుండా పంచాయతీ కార్యదర్శి అక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని కోరారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు.



బట్టి కుంటను పరిశీలిస్తున్న అధికారులు

పాపన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

గౌడ సంఘం మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్



పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, గౌడ సంఘం నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): బహుజన వీరుడు సర్దార్ పాపన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకుని బహుజనులు ముందుకు సాగాలని గౌడ సంఘం మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు ఆకుల మల్లేశంగౌడ్ అన్నారు. శుక్రవారం నార్సింగి గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ పాపన్నగౌడ్ 375వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొగులాయిలకు వ్యతిరేకంగా సైన్యం ఏర్పాటు చేసి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకున్న గొప్పవీరుడని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేసిభాయి, ఎంపీడీఓ ఆనంద్, ఎస్ఐ సృజన పాపన్నచిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి గౌడ సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్‌గౌడ్, సిద్ధాగౌడ్, స్వామిగౌడ్, ప్రవీణ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యంగౌడ్, అంజాగౌడ్, యాదగిరిగౌడ్, బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

పంట పొలాల్లో నిలిచిన నీరు



టేక్మాల్‌లోని పత్తి చేనులో నిలిచిన వర్షపునీరు

టేక్మాల్(మెదక్): మండలంలోని గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. మండలం మీదుగా ప్రవహిస్తున్న గుండువాగు ఉధృతంగా ప్రవహించడంతో జోగిపేట నుంచి టేక్మాల్‌కు, ఎలకుర్తి నుంచి టేక్మాల్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షంతో వరిపొలాలు నీట మునగడంతో పాటూ పత్తిచేళ్లల్లో నీరుచేరాయి. మండలంలోని తంప్లూర్‌లో బంటురామమ్మ, కల్యాణం లింగమ్మల ఇల్లు పాక్షికంగా కూలిపోయిన ఇళ్లను ఆర్ఐ సాయిశ్రీకాంత్ సందర్శించి వివరాలను సేకరించారు. సింగూరి నీటిని వదిలారని, గుండువాగు ఉధృతంగా ప్రవహించడంతో సమీప ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

చెరువు, కుంటలకు జలకళ

కౌడిపల్లి(నర్సాపూర్): వర్షాలతో చెరువు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మండలంలోని రాజిపేట, జాజితండా పంచాయతీల మధ్యలో ఉన్న వాగు లోవెవల్ బ్రిడ్జిపై నుంచి శుక్రవారం నీరుపారింది. దీంతో అటుగా వెళ్లవద్దని పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు సూచించారు. వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏఐ రంజిత్‌రెడ్డి సూచించారు.



ఇస్రానాయక్‌తండాలో రోడ్డుపై నుంచి పారుతున్న వరదనీరు



జేసీబీ సహాయంతో గండిని పూడుస్తున్న నాయకులు

ఇస్రానాయక్‌తండాలో కూలిన కల్వర్టు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. మండల పరిధిలోని బూర్గుపల్లి కట్టం చెరువు పొంగడంతో జమ్లానాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఇస్రానాయక్ తండాకు వెళ్లే సీసీ రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో కల్వర్టు కొంత మేర కూలిపోయింది. రహదారిపై నుంచి వెళ్లే తండావాసులకు ఇబ్బందిగా మారింది.

చెరువుగండి పూడ్చివేత

టేక్మాల్(మెదక్): భారీ వర్షానికి మండలంలోని పాగలంపల్లి చెరువుకు గండి పడింది. సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఈఈ సుప్రియ జేసీబీ, ట్రాక్టర్లను వెంటనే తెప్పించి గండిని పూడ్చివేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రమేష్ ప్రత్యేక చొరవ చూపారు.